# సోలో బతుకే సో బెటర్!

- పెండ్లి చేసుకోవడానికి చైనా యువత నిరాసక్తత
- కనిష్ఠ స్థాయికి వివాహాలు
- పెరుగుతున్న విడాకుల కేసులు
- ఫలితమివ్వని ప్రోత్సాహకాలు



బీజింగ్, ఫిబ్రవరి 10: సోలో బతుకే సో బెటర్ అంటున్నారు చైనా యువత. ఆ దేశంలో పెండ్లిండ్ల సంఖ్య కనిష్ఠ స్థాయికి పడిపోయింది. విడాకులు తీసుకుంటున్న జంటలు పెరిగిపోతున్నాయి. పెండ్లయిన యువత పిల్లల్ని కనేందుకు ఇష్టపడటం లేదు. దీంతో జనాభా సంక్షోభంపై చైనా సర్కారు ఆందోళన చెందుతున్నది. ప్రపంచంలోనే రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనాలో దేశ జనాభాను పెంచడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఆ దేశ పౌర వ్యవహారాల శాఖ తాజాగా విడుదల చేసిన డాటా ప్రకారం గత ఏడాది నమోదైన వివాహాల సంఖ్య 61 లక్షలకు పడిపోయింది. ఇది అంతకు ముందు సంవత్సరం కన్నా 20.5 శాతం తక్కువ. కొవిడ్ సంక్షోభం తర్వాత 2023లో ఈ వివాహాల సంఖ్య 77 లక్షలుగా నమోదైంది. వివాహాల నమోదు ప్రారంభమైన తర్వాత 2024లో నమోదైన సంఖ్యే అత్యల్పం. 2013లో నమోదైన గరిష్ఠ వివాహాల సంఖ్యలో ఇది సగం కన్నా తక్కువ.


**పెరుగుతున్న వృద్ధులు**

జనాభా తగ్గుదలపై చైనా ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ఒక పక్క వృద్ధుల సంఖ్య పెరిగిపోతుండగా, యువత శాతం తగ్గిపోతున్నది. ఇది భవిష్యత్తులో తీవ్ర అసమానతలకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే చైనాలో విడాకుల సంఖ్య కూడా స్వల్పంగా పెరిగినట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. 2024లో 26 లక్షల మంది విడాకులకు దరఖాస్తు చేశారు. 2023తో పోలిస్తే ఇది 28 వేలు ఎక్కువ. గత ఏడాది స్వల్ప మెరుగుదల మినహాయిస్తే చైనా జనాభా వరుసగా మూడేండ్ల పాటు తగ్గుతూ వచ్చింది. పనిచేసే వర్గంగా పేర్కొనే 16-59 ఏండ్ల వయస్కుల సంఖ్య 2024లో 68.3 లక్షలు తగ్గింది. అదే సమయంలో 60 అంతకు పైబడి వయస్కుల సంఖ్య పెరిగింది. మొత్తం జనాభాలో వీరి సంఖ్య 22 శాతం ఉంది.

**ఎన్ని ప్రోత్సాహకాలు ఇచ్చినా..**

యువతీ యువకుల వివాహాలకు, వారు పిల్లలను కనడానికి చైనా పాలకులు పలు ప్రోత్సాహకాలు ఇస్తున్నారు. యువతకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించడంతో పాటు అవగాహన శిబిరాలు ఏర్పాటు చేసి పెండ్లి చేసుకుని పిల్లల్ని కనాలంటూ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. అంతేకాకుండా ప్రభుత్వమే డేటింగ్ ఈవెంట్లు, సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నది. సంప్రదాయంగా అమ్మాయి తరపు వారికి పెద్ద మొత్తంలో కట్నం తరహాలో ఇచ్చే 'వధువు ధర'ను సైతం తగ్గించి పేద పెండ్లి కొడుకులు ఇబ్బంది పడకుండా ప్రయత్నిస్తున్నది. స్థానిక ప్రభుత్వాలు కొత్తగా పెండ్లి చేసుకున్న జంటలకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నాయి. ఇన్ని చేసినా యువత మనసు మార్చడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయనే చెప్పవచ్చు. దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగం, ఆర్థిక వ్యవస్థ మందగించడం, జీవన వ్యయం పెరిగిపోవడంతో చైనా యువత వివాహాల పట్ల అంత ఆసక్తి చూపడం లేదు.

# వాట్సాప్‌లో పెండ్లి!




ముజఫర్‌నగర్, ఫిబ్రవరి 10: బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో ఒక అసాధారణ సంఘటన చోటు చేసుకుంది. తాను వాట్సాప్ ద్వారా ఒక బాలికను వివాహం చేసుకున్నానని పేర్కొనడమే కాక, ఆమెతోనే కలిసి జీవిస్తానంటూ యువకుడు పట్టుబట్టాడు. దీనిని ఇరు కుటుంబాల వారు తిరస్కరించారు. ఇంటర్ చదువుతున్న ఈ యువతీ యువకులు వాట్సాప్‌లో పరిచయం అయ్యారు. పరిచయం ప్రేమగా మారింది. ఒక రోజు ఆ యువకుడు 'వివాహానికి నేను అంగీకరిస్తున్నా' అన్న మెసేజ్‌ను ఆమెకు మూడుసార్లు పంపగా ఆమె కూడా అదేవిధంగా స్పందించింది. దీంతో ఆమెతో తన పెండ్లి అయిపోయిందని, ఆమె తన భార్యగా భావించడం ప్రారంభించాడు. దీంతోబాలుడి పేరెంట్స్ పోలీసులను ఆశ్రయించారు. అతనికి గంటల పాటు పోలీసులు కౌన్సెలింగ్ చేసినా ఆమెయే తన భార్య అంటూ భీష్మించాడు.

# ఏఐ ఏజెంట్లే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు


- టెక్ ఉద్యోగుల పని చేయనున్న కృత్రిమ మేధ
- త్వరలో తీసుకురానున్నట్టు ఓపెన్‌ఏఐ సీఈఓ ప్రకటన
- ఇప్పటికే ఏఐ వినియోగాన్ని పెంచిన గూగుల్, మెటా



న్యూయార్క్, ఫిబ్రవరి 10: సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కొలువులకు ఇక దినదిన గండమేనా? టెక్ ఉద్యోగుల స్థానాన్ని ఏఐ ఆక్రమించేస్తుందా? ఇంతకాలం డ్రీమ్ జాబ్‌గా ఉన్న ఐటీ ఉద్యోగం డేంజర్ జోన్‌లో పడ్డట్టేనా? ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ చేసిన ఒక ప్రకటన ఈ అనుమానాలు మరింత బలపరుస్తున్నది. చాట్‌జీపీటీతో ఏఐ రంగంలో సంచలనం సృష్టించిన ఓపెన్ ఏఐ భవిష్యత్ ప్రణాళికల గురించి శామ్ ఆల్ట్‌మన్ తన తాజా బ్లాగ్ పోస్ట్‌లో కీలక విషయాలు వెల్లడించారు. త్వరలో తమ సంస్థ ఏఐ ఏజెంట్లను అందుబాటులోకి తీసుకురానున్నదని, కొన్ని సంవత్సరాల అనుభవం కలిగిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు చేసే పనిని ఈ ఏఐ ఏజెంట్లు చేసే స్థాయని ప్రకటించారు. కోడింగ్, డెవలప్‌మెంట్ పనుల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు వర్చువల్ సహోద్యోగులుగా ఏఐ ఏజెంట్లు పని చేయనున్నట్టు వెల్లడించారు. భవిష్యత్తులో ఊహలకందని స్థాయిలో వివిధ రంగాల్లో ఏఐ ఏజెంట్లు విస్తరిస్తాయని, ఏఐ ద్వారా ఉత్పాదకత పెరుగుతుందని చెప్పారు. అయితే, ఆర్థిక అసమానతలకు ఇది దారితీయొచ్చని అభిప్రాయపడ్డారు.

**సాఫ్ట్‌వేర్ కొలువులు సేఫేనా?**

ఏఐ ఏజెంట్లతో పెద్ద సంఖ్యలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కొలువులకు కోత పడే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పలు టెక్ దిగ్గజ సంస్థలు ఏఐ వినియోగాన్ని పెంచాయి. ఖర్చులు తగ్గించుకునేందుకు గానూ కోడ్ రాసే మధ్య స్థాయి ఇంజినీర్లను ఏఐతో భర్తీ చేసే ఆలోచనలు ఉన్నట్టు మెటా సీఈఓ మార్క్ జుకర్‌బెర్గ్ ఇటీవల ప్రకటించారు. ఇప్పుడు గూగుల్‌లో దాదాపు 25 శాతం కోడ్‌ను ఏఐ రాస్తున్నట్టు ఇటీవల ఆ సంస్థ సీఈఓ సుందర్ పిచాయ్ వెల్లడించారు. అయితే, ఏఐ రాసిన కోడ్‌ను చివరగా ఇంజినీర్లు పరిశీలిస్తున్నట్టు చెప్పారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు చేసే పనిని ఏఐ ఏజెంట్లు చేసినప్పటికీ, ఇవి కొత్త ఆలోచనలు చేయలేవని, వీటి పనిని మనుషులు పర్యవేక్షించాల్సి ఉంటుందని ఆల్ట్‌మన్ చెప్పారు. ఏఐతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల సంఖ్య తగ్గే ప్రమాదం ఉందని వీరి మాటలు పరోక్షంగా చెప్తున్నాయి. ఇదే సమయంలో కోడింగ్‌తో పాటు ఏఐ నైపుణ్యాలు కలిగిన వారి ఉద్యోగాలకు మాత్రం ముప్పు ఉండకపోవచ్చని నిపుణులు చెప్తున్నారు.




# బీ బ్లడ్ గ్రూప్ వారికి దీర్ఘాయుష్షు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహారం, జీన్స్.. ఓ వ్యక్తి ఎన్నేండ్లు బతుకుతుతాడన్నది నిర్ణయిస్తాయనేది అందరూ నమ్ముతున్న సిద్ధాంతం! ఇవేగాకుండా బ్లడ్ గ్రూప్‌నకు, వృద్ధాప్యానికి సంబంధముందని తాజా అధ్యయనం ఒకటి అంచనావేసింది. 'బీ-బ్లడ్ గ్రూప్' వ్యక్తుల్లో దీర్ఘాయుష్షు కనిపిస్తున్నదని, నెమ్మదిగా వృద్ధాప్యం బారిన పడటానికి 'బీ'-బ్లడ్ గ్రూప్ కారణమై ఉండవచ్చునని సైంటిస్టులు చెబుతున్నారు. ఇతర బ్లడ్ గ్రూపులతో పోలిస్తే బీ బ్లడ్ గ్రూప్‌నకు వృద్ధాప్య నిరోధకత ఎక్కువగా ఉన్నదని ఈ అధ్యయనం తెలిపింది. కణజాలం పునరుత్పత్తి, సెల్యులార్ రిపేర్ వృద్ధాప్యాన్ని నెమ్మదింపజేస్తుందని పేర్కొన్నది. అయితే వ్యాయామం, హెల్తీ డైట్, ఒత్తిడిని తగ్గించుకోవడం వంటి ప్రాథమిక సూత్రాలు పాటించకపోతే ఇది సాధ్యం కాదని స్పష్టంచేసింది.

# దోషులు మళ్లీ చట్టసభ్యులు కావడమా?

- నాలుగో తరగతి ఉద్యోగి పైనే జీవితకాలం నిషేధం విధింపు
- ప్రజా ప్రతినిధులు మాత్రం మళ్లీ ఎన్నిక అవుతూనే ఉన్నారు
- చట్ట సభల సభ్యుల కేసులపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు
- కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ఏదైనా నేరంలో దోషిగా తేలిన ఫోర్త్ క్లాస్ ప్రభుత్వ ఉద్యోగి పైనే జీవితకాలం నిషేధం విధిస్తున్నప్పుడు, దోషులుగా తేలిన వారు మళ్లీ ఎంపీలు, ఎమ్మెల్యేలు అవడాన్ని సుప్రీంకోర్టు ఆక్షేపించింది. క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన ఎంపీలు, ఎమ్మెల్యేలపై జీవితకాల నిషేధం విధించాలని కోరుతూ న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సోమవారం జస్టిస్ దీపాంకర్ దత్త, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది. జైలు శిక్ష పూర్తయిన తరువాత ఆరేండ్ల వరకు మాత్రమే మళ్లీ పోటీ చేయకుండా ప్రజా ప్రాతినిధ్య చట్టం నిషేధిస్తున్నదని న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ వ్యాజ్యంపై అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా స్పందిస్తూ.. దేశవ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్యేలపై 5 వేల క్రిమినల్ కేసులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రజాప్రతినిధులపై కేసుల విచారణను త్వరగా పూర్తి చేయాలని సుప్రీంకోర్టు పలు మార్లు చెప్పినా ఇప్పటికీ 42 శాతం మంది సిట్టింగ్ లోక్‌సభ సభ్యులపై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉండటం సిగ్గు పడాల్సిన అంశమని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 8, 9వ సెక్షన్లపై మరో న్యాయవాది వికాస్ తన వాదనలు వినిపించారు. తీవ్రమైన నేరాల్లో దోషులుగా తేలి 2-3 ఏండ్ల స్వల్పకాల జైలుశిక్షను అనుభవించిన తర్వాత కూడా ఎంపీగా, ఎమ్మెల్యేగా ఎన్నికయ్యే వీలు ఈ సెక్షన్ల ద్వారా ఉందని, ఇలా జరుగుతుందని ఈ సెక్షన్లను రూపొందించినప్పుడు పార్లమెంటు అనుకొని ఉండదని పేర్కొన్నారు.

**రాజకీయాలు నేరమయం కావడం పెద్ద సమస్య**

ఈ వాదనలపై జస్టిస్ దీపాంకర్ దత్తా స్పందిస్తూ.. 'హత్య, అత్యాచారం వంటి తీవ్రమైన నేరాల్లో దోషిగా తేలిన క్లాస్ ఫోర్ ప్రభుత్వ ఉద్యోగి మళ్లీ తన ఉద్యోగాన్ని పొందడానికి వీలు లేదు. కానీ, ఒక ఎంపీనో, ఎమ్మెల్యేనో మళ్లీ ఎన్నిక కాగలుగుతున్నారు. మంత్రి కూడా కాగలుగుతున్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 8, 9వ సెక్షన్లను సమగ్రంగా పరిశీలిస్తాం' అని వ్యాఖ్యానించారు. కాగా, ప్రస్తుతం హత్య కేసులో దోషిగా తేలిన వ్యక్తి కూడా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ అధ్యక్షుడు కాగలుగుతున్నాడని, దీనిని నిలువరించాలని పిటిషన్‌దారు కోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన జస్టిస్ మన్మోహన్.. 'ఒక దేశంగా మనం సాధించాల్సిన లక్ష్యం మీదీ. కానీ, అసమగ్రంగా ఒక నిర్ణయం తీసుకోవద్దు. మనం ఏదైనా లొసుగు వదిలేస్తే, ఆ తీర్పు ఎలాంటి ప్రభావం చూపదు. ప్రజలు మరింత విశ్వాసాన్ని కోల్పోతారు' అని వ్యాఖ్యానించారు. రాజకీయాలు నేరమయం కావడం చాలా పెద్ద అంశమని, ఎన్నికల సంఘం ఈ విషయంపై దృష్టి పెట్టి, మెరుగైన పరిష్కారాన్ని గుర్తించి ఉండాల్సిందని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. ఈ వ్యాజ్యంపై మరోసారి స్పందన తెలియజేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ విచారణను మార్చి 4వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది.

# 300 కిలోమీటర్ల ట్రాఫిక్ జామ్

- ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో ఉక్కిరి బిక్కిరి అవుతున్న భక్తులు
- 48 గంటలుగా నగరం చుట్టూ చిక్కుకుపోయిన ప్రయాణికులు
- రద్దీని తట్టుకోలేక స్థానిక రైల్వే స్టేషన్‌ను మూసివేసిన అధికారులు
- అలాంటిదేమీ లేదని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటన
- యూపీ నిర్వహణా వైఫల్యంపై ఎస్పీ అధినేత అఖిలేశ్ ఫైర్



ప్రయాగ్‌రాజ్‌లోని ఓ ఫ్లైవర్‌పై భారీగా ట్రాఫిక్ జామ్



ప్రయాగ్‌రాజ్‌లో సోమవారం పుణ్యస్నానం చేస్తున్న రాష్ట్రపతి ముర్ము

ప్రయాగ్‌రాజ్: మహా కుంభమేళా జరుగుతున్న ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే దారులన్నీ తీవ్ర ట్రాఫిక్ జామ్‌తో నిండిపోతున్నాయి. 100 నుంచి 300 కి.మీ వరకు వాహనాలు బారులు తీరాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. 200 కి.మీ దూరం నుంచి ప్రయాగ్‌రాజ్ రావడానికి తమకు 16 గంటలు పట్టిందని ఒక కుటుంబం వాపోయింది. నడక దారులు కూడా కిక్కిరిసిపోవడంతో 4 కి.మీ దూరానికి నాలుగు గంటలు పడుతున్నదని పలువురు భక్తులు వాపోయారు. రోజూ లక్షలాది మంది భక్తులు తరలివస్తుండటంతో నగరానికి దారితీసే అన్ని దారులు ట్రాఫిక్ జామ్‌తో స్తంభించిపోయాయి. దీంతో భక్తులు తాము అనుకున్న సమయానికి చేరలేక, గంగా, యమున, సరస్వతి సంగమంలో పుణ్య స్నానాలు చేయలేక తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కూడా పరిస్థితిని చూసి చేతులెత్తేసినట్టు కన్పించింది. లక్షలాది మంది భక్తులు పోటెత్తడంతో ప్రయాగ్‌రాజ్ రైల్వేస్టేషన్‌ను శుక్రవారం వరకు మూసివేశారు. కాగా, రైల్వే స్టేషన్‌ను మూసివేసినట్టు జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దంటూ రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. ట్రాఫిక్ జామ్‌లలో గంటల పాటు చిక్కుకుపోయిన పలువురు విసిగిపోయి వెనక్కి వెళ్లిపోతుండటం కూడా కన్పించింది.

**సామాన్యుల ఇబ్బందులు పట్టవా?: అఖిలేశ్**

మహా కుంభమేళా నిర్వహణలో యూపీ ప్రభుత్వ వైఫల్యంపై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ తీవ్రంగా మండిపడ్డారు. లక్షలాది మంది భక్తులు తీవ్ర ట్రాఫిక్ జామ్‌లో గంటల తరబడి చిక్కుకుపోయి ఆకలి, దప్పులతో అలమటిస్తున్నారని, టాయిలెట్ సౌకర్యం లేక అల్లాడుతున్నారని అన్నారు. సామాన్యుల ఇబ్బందులు మీకు పట్టవా? అని ప్రశ్నించిన ఆయన వారిని మానవతా దృష్టితో చూడాలని కోరారు. కుంభ మేళా ఏర్పాట్ల గురించి యోగి ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితమైంది తప్ప, క్షేత్ర స్థాయిలో అడుగడుగునా లోపాలు, వైఫల్యాలు కొట్టొచ్చినట్టు కనబడుతున్నాయని ఆయన విమర్శించారు.

**అయోధ్య, కాశీలకు పెరిగిన భక్తుల రద్దీ**

ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించిన తర్వాత భక్తులు కాశీ, అయోధ్యలను కూడా దర్శించుకుంటుండటంతో ఈ రెండు ప్రాంతాలు లక్షలాది మంది భక్తులతో నిండిపోతున్నాయి.



**వినువీధిలో వీరోచితంగా..**

'ఏరో ఇండియా-2025' సోమవారం బెంగళూరులో అట్టహాసంగా ప్రారంభమైంది. రాఫెల్ యుద్ధ విమానాలను నడిపిన మహిళా పైలట్లు, భారత వైమానిక శక్తిని చాటారు. సూర్య కిరణ్ ఏరోబాటిక్ టీమ్ నడిపిన విమానాలు ఆకాశంలో గర్జిస్తూ విన్యాసాలు చేశాయి.

# 50 లక్షలు ఖర్చు పెట్టి 5 నిమిషాల్లో అరెస్టయ్యాడు!

చండీగఢ్: ట్రావెల్ ఏజెంట్లను నమ్మి రూ.50 లక్షలు ధారపోసి అమెరికా వెళ్లిన ఓ హర్యానా వ్యక్తి అక్కడకెళ్లిన 5 నిమిషాలకే పోలీసుల చేతికి చిక్కారు. గత నెల 25న అమెరికా మన దేశానికి తిప్పి పంపిన చట్టవిరుద్ధ వలసదారుల్లో ఈ వ్యక్తి ఉన్నారు. హిసార్ జిల్లాలోని ఖరర్ గ్రామస్థుడైన అక్షయ్ తనను మోసగించిన ముగ్గురు ఏజెంట్లపై పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. బాధితుడు పోలీసులకు తెలిపిన కథనం ప్రకారం.. అతడిని నిరుడు జూన్‌లో వర్క్ వీసా మీద అమెరికా పంపిస్తామని చెప్పి ఏజెంట్లు ఈ మోసానికి పాల్పడ్డారు. 'నన్ను చట్టబద్ధంగా విమానంలో అమెరికాకు పంపడానికి రూ.35 లక్షలు ఖర్చవుతుందని చెప్పిన ఏజెంట్లు చివరకు రూ.50 లక్షలు వసూలు చేశారు. నన్ను మొదట దుబాయ్ నుంచి సురినామ్, అక్కడ నుంచి మెక్సికో, మెక్సికో నుంచి బస్సులో అమెరికాకు తీసుకెళ్లారు. అక్కడ దిగిన 5 నిమిషాలకే పోలీసులు నన్ను అరెస్ట్ చేసి నిర్బంధ కేంద్రానికి తరలించారు' అని బాధితుడు వాపోయారు.

# అమెరికా బాటలో యూకే

- అక్రమ వలసదారుల కోసం జల్లెడ
- జనవరిలోనే 609 మంది అరెస్టు
- భారతీయ రెస్టారెంట్లపై ప్రత్యేక దృష్టి



లండన్, ఫిబ్రవరి 10: అక్రమ వలసదారులపై కొరడా ఝుళిపించడంలో అమెరికా బాటలో యూకే నడుస్తున్నది. దేశవ్యాప్తంగా అక్రమ వలసదారుల కోసం జల్లెడ పడుతున్నది. భారతీయ రెస్టారెంట్లపై ప్రత్యేక దృష్టి పెట్టి గాలిస్తున్నది. అక్రమ వలసలపై తీసుకుంటున్న చర్యల గురించి సోమవారం యూకే హోం సెక్రటరీ య్వెట్ కూపర్ కీలక ప్రకటన చేశారు. జనవరిలో 828 ప్రదేశాల్లో తనిఖీలు చేపట్టామని, ఇది గత ఏడాది జనవరి కంటే 48 శాతం అధికమని చెప్పారు. ఈ తనిఖీల్లో 609 మంది అక్రమ వలసదారులను అరెస్టు చేశామని, గత ఏడాది జనవరిలో అరెస్టుల కంటే ఈ సంఖ్య 73 శాతం అధికమని తెలిపారు. అక్రమ వలసదారులను గుర్తించేందుకు చేస్తున్న తనిఖీల్లో భారతీయ రెస్టారెంట్లు, నెయిల్ బార్లు, దుకాణాలు, కార్ వాష్ సెంటర్లపై భద్రతా సిబ్బంది ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. హంబర్‌సైడ్‌లోని ఓ భారతీయ రెస్టారెంట్‌లో తనిఖీలు చేసి ఏడుగురు అక్రమ వలసదారులను అరెస్టు చేశామని, నలుగురిని దేశం నుంచి పంపించేశామని హోంశాఖ కార్యాలయం తన ప్రకటనలో ప్రత్యేకంగా ప్రస్తావించింది.

**అక్రమ వలసలకు ముగింపు: యూకే ప్రధాని**

అక్రమ వలసలపై యూకే ప్రధాని కీర్ స్టార్మర్ సోమవారం కీలక ప్రకటన చేశారు. 'చాలా ఎక్కువ మంది యూకేకు అక్రమంగా వచ్చి, పని చేయగలుగుతున్నారు. దీనికి మేము ముగింపు పలుకుతున్నాం' అని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. అక్రమ వలసలను అడ్డుకునేందుకు భద్రతా సిబ్బందికి అదనపు అధికారాలు కట్టబెడుతూ యూకే ప్రభుత్వం కొత్తగా సరిహద్దు రక్షణ, శరణు, వలసల బిల్లును తీసుకువస్తున్నది.

**భారతీయుల సంఖ్య ఎక్కువే!**

యూకేకు అక్రమంగా వలస వెళ్తున్న వారిలో భారతీయుల సంఖ్య ఏటేటా పెరుగుతున్నది. 2023లో దాదాపు వెయ్యి మంది భారతీయులు చిన్న పడవలపై ప్రమాదకరంగా ఇంగ్లిష్ చానెల్‌ను దాటి యూకేలో అడుగుపెట్టారనే అంచనాలు ఉన్నాయి. ఈ సంఖ్య 2022 కంటే రెట్టింపు కావడం గమనార్హం. యూకేలో ఆశ్రయం కోరిన భారతీయుల సంఖ్య 2023లో మొదటిసారి ఐదు వేలు దాటింది.



# సౌదీ మల్టిపుల్ ఎంట్రీ వీసాల నిలిపివేత

న్యూఢిల్లీ: పర్యాటకం, వ్యాపారం, కుటుంబ సందర్శనల కోసం సింగిల్ ఎంట్రీ వీసాలను మాత్రమే జారీ చేయాలని సౌదీ అరేబియా నిర్ణయించింది. ఒక సంవత్సరంపాటు చెల్లుబాటయ్యే మల్టిపుల్ ఎంట్రీ వీసాలను నిరవధికంగా నిలిపేసింది. ఈ నిర్ణయం ఈ నెల 1 నుంచి అమల్లోకి వచ్చింది. దీర్ఘకాలిక వీసాలపై వచ్చేవారు చట్టవిరుద్ధంగా ఉద్యోగాలు చేయడం కోసం, అనుమతులు లేకుండా హజ్ యాత్ర చేయడం వంటివాటికి పాల్పడుతున్నారని అధికారులు చెప్పారు. మల్టిపుల్ ఎంట్రీ వీసాల నిలిపివేత నిర్ణయం తాత్కాలికమేనని తెలిపారు. సింగిల్ ఎంట్రీ వీసాలు 30 రోజులపాటు మాత్రమే చెల్లుతాయి. హజ్, ఉమ్రా, రెసిడెన్సీ వీసాల్లో మార్పులు ఉండవు.

# తల్లిదండ్రులపై జుగుప్సాకర వ్యాఖ్యలు

- ఇన్‌ఫ్లుయెన్సర్ రణ్‌వీర్ అల్లాబడియాపై సర్వత్రా ఆగ్రహం
- మండిపడ్డ మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్, పలువురు ఎంపీలు



న్యూఢిల్లీ: తల్లిదండ్రులపై అత్యంత జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేసిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ రణ్‌వీర్ అల్లాబడియాపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్నది. కమెడియన్ సమయ్ రైనా నిర్వహిస్తున్న 'ఇండియాస్ గాట్ లాటెంట్' రియాల్టీ షోలో అల్లాబడియా పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ఒక పార్టిసిపెంట్‌ను అతడు తల్లిదండ్రులను ఉద్దేశించి అసభ్య, తీవ్ర అభ్యంతరకర ప్రశ్న అడిగాడు. ఇది వైరల్‌గా మారడంతో అతడిపై సోషల్ మీడియాలో, బయట తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది. వాక్‌స్వాతంత్ర్యం పేరుతో హద్దులు దాటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ పేర్కొన్నారు. హాస్యం పేరుతో అసభ్యకర వ్యాఖ్యలను సహించవద్దని శివసేన(యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది అన్నారు. వివిధ పార్టీల నేతలు అల్లాబడియాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడిపై ముంబైలో బీజేపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అల్లాబడియాపై విచారణ జరపాలని కోరుతూ బాంద్రా కోర్టులో ఎన్ఎస్‌యూఐ ఫిర్యాదు చేసింది. తన వ్యాఖ్యలపై విమర్శలు రావడంతో అల్లాబడియా క్షమాపణలు చెప్తూ ఓ వీడియో విడుదల చేశాడు.

**నేషనల్ క్రియేటర్ అవార్డు గ్రహీత**

బీర్‌బైసెప్స్ పేరుతో వీడియోలు చేసే రణ్‌వీర్ అల్లాబడియా(31)కు సోషల్ మీడియాలో దాదాపు 1.6 కోట్ల మంది ఫాలోయర్స్ ఉన్నారు. గత ఏడాది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతులమీదుగా ఉత్తమ క్రియేటర్‌గా నేషనల్ క్రియేటర్ అవార్డును సైతం అందుకున్నాడు. డిజిటల్ ఇండియా కార్పొరేషన్‌తో భాగస్వామ్యం కుదుర్చుకొని కొందరు కేంద్ర మంత్రులను సైతం అల్లాబడియా ఇంటర్వ్యూలు చేశారు.



# పాలస్తీనియన్లకు గాజాకు తిరిగి వచ్చే హక్కు లేదు

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్**

వాషింగ్టన్, ఫిబ్రవరి 10: పాలస్తీనియన్లకు గాజాకు తిరిగి వచ్చే హక్కు ఉండదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. యుద్ధంలో శిథిలమైన గాజాను స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'గాజాను స్వాధీనం చేసుకుంటాం. నా ప్రణాళిక ప్రకారం.. పాలస్తీనియన్లు నివసించేందుకు గాజా బయట ఆరు ప్రాంతాలు ఉంటాయి' అని పేర్కొన్నారు. పాలస్తీనియన్లను గాజాకు తిరిగి వచ్చేందుకు అనుమతిస్తారా? అని ప్రశ్నించగా.. లేదు, వారికి ఎలాంటి హక్కు ఉండదు అని స్పష్టంచేశారు.

## ఆ బిల్లులను రాష్ట్రపతికి ఎలా పంపుతారు?

**తమిళనాడు గవర్నర్‌కు సుప్రీం కోర్టు ప్రశ్న**

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు సోమవారం తమిళనాడు గవర్నర్ ఆర్ ఎన్ రవికి పలు ప్రశ్నలను సంధించింది. ''శాసన సభ రెండోసారి ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు ఎలా పంపిస్తారు? బిల్లులపై ఏండ్లపాటు మౌనంగా ఎందుకు ఉన్నారు? ప్రభుత్వానికి ఎందుకు సమాచారం ఇవ్వలేదు? మీ ఆమోదాన్ని తెలియజేయకుండా నిలిపి ఉంచి, రాష్ట్రపతి పరిశీలనకు ఎందుకు పంపించారు?'' అని ప్రశ్నించింది. 12 బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలపడం లేదని ఆరోపిస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును రిజర్వు చేసింది.

## మంచినీరు లేక అల్లాడుతుంటే.. సైకిల్ ట్రాక్స్ కావాలా?

**పిటిషనర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం**

న్యూఢిల్లీ : నివాస యోగ్యమైన ఇండ్లను ప్రజలకు అందుబాటులోకి తేవడానికి రాష్ట్ర ప్రభుత్వాల వద్ద నిధులు ఉండటం లేదని, ప్రజలు తాగడానికి పరిశుభ్రమైన నీరు లేదని, అటువంటి సమయంలో మీరు సైకిల్ ట్రాక్స్ కోసం పగటి కలలు కంటున్నారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దేశవ్యాప్తంగా సైకిల్ ట్రాక్‌లను నిర్మించాలని కోరుతూ దాఖలైన పిల్‌ను తిరస్కరించింది. మురికివాడల్లోకి ఓసారి వెళ్లి, అక్కడి ప్రజలు ఎలా జీవిస్తున్నారో చూడాలని, ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయని తెలిపింది. ఎంచుకునే ప్రాధాన్యతలు సరైన విధంగా ఉండాలని, అత్యవసరమైన సమస్యల పట్ల దృష్టి సారించాలని హితవు పలికింది.

## 175 కోట్లతో పూర్తయ్యే దానికి 11 వేల కోట్లా?

**'ఆధార్' ప్రాజెక్టుపై 'హాట్‌మెయిల్' సహ వ్యవస్థాపకుడు భాటియా**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: దేశంలో నివసిస్తున్న పౌరులందరికీ విశిష్ట గుర్తింపు నంబర్ (యూఐడీ) జారీ కోసం చేపట్టిన 'ఆధార్' ప్రాజెక్టుకు ప్రభుత్వం అనవసరంగా భారీ మొత్తాన్ని ఖర్చు చేసిందని 'హాట్‌మెయిల్' సహ వ్యవస్థాపకుడు సబీర్ భాటియా విమర్శించారు. కేవలం రూ.175.16 కోట్లతో పూర్తయ్యే ఈ పని కోసం ఏకంగా రూ.11,385 కోట్లు వెచ్చించిందని పేర్కొన్నారు. ప్రఖర్ గుప్తా నిర్వహించిన 'ప్రఖర్ కే ప్రవచన్' టాక్ షోలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఆధార్' ప్రాజెక్టును చేపట్టిన వ్యక్తి సాంకేతిక నిపుణుడు కాదని, ఆయనకు సాంకేతికత గురించి తెలియదని అన్నారు.

## వ్యవసాయోత్పత్తుల సేకరణ పరిమితి పెంపు

న్యూఢిల్లీ : మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ (ఎంఐఎస్) మార్గదర్శకాలను కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ సోమవారం సవరించింది. వీటి సేకరణ పరిమితిని ప్రస్తుత 20 శాతం నుంచి 25 శాతానికి పెంచింది. ఈ పథకాన్ని అమలు చేసే విధంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాలను ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. టమాటా, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు వంటి వాటికి కనీస మద్దతు ధర వర్తించదు. త్వరగా చెడిపోయే వ్యవసాయ/ఉద్యానవన పంటలకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ ఉత్పత్తులకు మార్కెట్ ధరలో కనీసం 10 శాతం తగ్గుదల కనిపించినపుడు మాత్రమే ఈ పథకం అమలవుతుంది. మార్కెట్ ఇంటర్వెన్షన్ ధరకు, అమ్మకపు ధరకుగల వ్యత్యాసాన్ని రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేస్తారు.

## కాంగ్రెస్‌తో పొత్తు ప్రసక్తే లేదు

**మమతా బెనర్జీ స్పష్టీకరణ**

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సహ ఏ పార్టీతో పొత్తు ఉండదని సీఎం మమతా బెనర్జీ తేల్చిచెప్పారు. ఎన్నికల్లో టీఎంసీ ఒంటరిగానే పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. సోమవారం పార్టీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, 'హర్యానా ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఆప్ సాయపడలేదు. అలాగే.. ఢిల్లీలో ఆప్ గెలుపునకు కాంగ్రెస్ సహకరించలేదు. దీంతో రెండు రాష్ట్రాలను బీజేపీ కైవసం చేసుకుంది. ఇక బెంగాల్‌లో కాంగ్రెస్ చేయడానికి ఏమీ లేదు. మనం ఒంటరిగానే బరిలోకి దిగుతున్నది' అని చెప్పారు.